క్లుప్తంగా

23 నుంచి మావూరమ్మ జాతర


మావూరమ్మ తల్లి

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని బంగారు వారి చెరువు గట్టు ప్రాంతంలో కొలువైన మావూరమ్మ తల్లి జాతరను ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శంకరాపు శ్రీనివాస్, సభ్యులు తెలిపారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తామని తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నట్లు వివరించారు.

శివారు భూములకూ సాగునీరు


పంటబోదె నుంచి సాగు నీరు తోడుకుంటున్న రైతులు

మొగల్తూరు: వేసవి నేపథ్యంలో ప్రధాన కాలువల నుంచి నీటి ప్రవాహం ఆగనున్నందున ముందు జాగ్రత్తగా రైతులు తమ భూములకు నీరందేలా చర్యలు తీసుకుంటున్నారు. మొగల్తూరు ప్రధాన కాలువ నుంచి జంగిల్ ఛానల్ ద్వారా కేపీపాలెంలోని మంచి నీటి చెరువుతో పాటు పంట భూములకు నీరందుతుంది. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఈనెల 20వ తేదీ తరువాత కాలువలు కట్టేసే అవకాశం ఉన్నందున మోటార్లు వేసి నీరు తోడుకుంటున్నారు. మంగళవారం కేపీపాలెం పంచాయతీ రాజు గారి ఒడ్డు ప్రాంతం నుంచి మంచి నీటి చెరువు ప్రాంతంలోని శివారు భూములకు నీరందేలా జంగిల్ ఛానల్ పంట బోదెకు మోటార్లు వేసి శివారు ప్రాంతాల్లోని తమ భూములకు సాగు నీరందేలా ఆప్రాంత రైతులు కృషి చేస్తున్నారు.

తాగునీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలి


చెరువుకు నీటి తరలింపును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బీవీ నాగేశ్వరరావు

యలమంచిలి: కాలువలు మూసివేసే సమయానికి మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బీవీ నాగేశ్వరరావు ఆదేశించారు. శిరగాలపల్లి, ఆర్యపేట, యలమంచిలి, చించినాడ, కలగంపూడిలోని మంచినీటి చెరువులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులు ఈ నెల 17 నుంచి 25 వరకు మంచి నీటి చెరువులకు కాలువల ద్వారా నీరు సరఫరా చేస్తున్న నేపథ్యంలో ఈ షెడ్యూల్ ప్రకారం చెరువులు నింపాలని ఆయన సూచించారు. అవసరమైతే ఇంజన్లు ఏర్పాటు చేసి చెరువులను నింపాలన్నారు. వేసవిలో లిక్విడ్ క్లోరినేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన గ్రామ కార్యదర్శులకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పి శ్రీనివాస్, ఏఈ మట్రిపూడి సురేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాలా శారదా శ్రీనివాస్, మాదాసు హరిప్రసాద్ పాల్గొన్నారు.

నేడు 12, 16 వార్డుల్లో గుడాల గోపి ఎన్నికల ప్రచారం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లులోని 12, 16 వార్డులో బుధవారం మధ్యాహ్నం 3గంటలనుంచి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొని గుడాల గోపికి మద్దతుగా ప్రచారం నిర్వహించాలని ఆయన కోరారు.

మేమంతా సిద్ధమంటూ పయనం

- ఉత్సాహంగా భీమవరం తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- బస్సులకు జెండా ఊపి ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, నాయకులు


పాలకొల్లు అర్బన్: వాహనాలకు జెండా ఊపి ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు


పాలకొల్లు: కొత్తపేట నుంచి బస్సులో సిద్ధం సభకు వెళుతున్న నాయకులు


మొగల్తూరు: రామన్నపాలెం నుంచి భీమవరం సిద్ధం సభకు తరలివెళ్తున్న పార్టీ శ్రేణులు


నరసాపురం రూరల్: కె బేతపూడి నుంచి సభకు వెళుతున్న నేతలు


నరసాపురం రూరల్: నరసాపురం 23వ వార్డు నుంచి వెళ్లుతున్న అభిమానులు


పెనుగొండ: కళాశాల సెంటర్ నుంచి మేమంతా సిద్ధం బస్సులను ప్రారంభిస్తున్న నాయకులు


పెనుగొండ: సిద్ధాంతం నుంచి భీమవరం బయలు దేరిన నాయకులు


పెనుగొండ: ఆచంట నుంచి సిద్ధం సభకు తరలివెళ్లిన నాయకులు


పెనుమంట్ర : ఎస్ ఇల్లిందలపర్రు నుంచి తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు


యలమంచిలి: మేడపాడు నుంచి బస్సును ప్రారంభిస్తున్న పార్టీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు


నరసాపురం రూరల్: మల్లవరంలంక నుంచి సిద్ధం సభకు వెళుతున్న నేతలు

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆధ్వర్యంలో భీమవరం సిద్ధం సభకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి బస్సుల్లో కార్యకర్తలు, నాయకులు సిద్ధం సభకు వెళ్లారు. యలమంచిలి, పాలకొల్లు పట్టణం నుంచి వెళ్లే బస్సులకు వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద గుడాల గోపి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ సిద్ధం సభలకు స్వచ్ఛందంగా వస్తున్న ప్రజల స్పందన చూసి జీర్ణించుకోలేని కూటమి నేతలు ప్రత్యక్ష దాడులకు సిద్ధపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభలకు వస్తున్న ప్రజాదరణను ఆపడం ఎవరి తరమూ కాదని గోపి స్పష్టం చేశారు. మరలా వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పాలకొల్లు, పోడూరు మండలాల్లోని ప్రతీ గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు సిద్ధం సభకు బస్సుల్లో వెళ్లారు. టీటీడీ పాలక మండలి సభ్యులు మేకా శేషుబాబు, వైఎస్సార్ సీపీ చింతలపూడి పరిశీలకులు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఆలయాల చైర్మన్లు, అనుబంధ కమిటీల నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

రామన్నపాలెం నుంచి పయనం

మొగల్తూరు: మేమంతా సిద్ధం సభకు బస్సు యాత్ర ద్వారా మంగళవారం భీమవరానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు. ఈ సభలో పాల్గొనేందుకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి సుమారు 50 బస్సులు భీమవరం సిద్ధం సభకు వెళ్లేలా నాయకులు ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కర్రి ఏసుబాబుతో పాటు గ్రామాలకు చెందిన పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలతో పాటు స్థానిక నాయకులు బాధ్యత తీసుకుని కార్యకర్తలు, అక్కచెల్లెమ్మలు, అవ్వతాతలు వేలాదిగా భీమవరం తరలివెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

మేడపాడు నుంచి బస్సుల్లో పయనం

యలమంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం భీమవరంలో నిర్వహించిన మేమంతా సిద్ధం సభకు యలమంచిలి మండలం నుంచి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) నాయకత్వంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాతూరి బుచ్చిరాజు ఆధ్వర్యంలో సుమారు 1,500 మంది 30 ఆర్టీసీ బస్సుల్లో భీమవరం వెళ్లారు. ప్రైవేట్ వాహనాలు, బైక్‌లపై పెద్ద సంఖ్యలో నాయకులు భీమవరం వెళ్లారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల సందడి

నరసాపురం రూరల్: భీమవరంలో మేమంతా సిద్ధం సభకు నరసాపురం మండలంలోని వివిధ గ్రామాలు, పట్టణం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు మంగళవారం చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో తరలివెళ్లారు. యర్రంశెట్టిపాలెం పితాని మెరక, కె బేతపూడి, మల్లవరంలంక, రుస్తుంబాద, లక్ష్మణేశ్వరం, సీతారాంపురం గ్రామాలనుంచి సభకు పార్టీ శ్రేణులు ఉత్సాహంగా వెళ్లారు. పితానిమెరకనుండీ బయలుదేరిన బస్సును పార్టీ మండల కన్వీనర్ దొంగ మురళీ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని రాయపేట నుంచి బయలు దేరిన బస్సులో కావలి రామసీత నాని ఆధ్వర్యంలో జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో నాయకులు, అభిమానులు భీమవరం సభకు తరలివెళ్లారు.

భారీగా తరలిన నాయకులు, కార్యకర్తలు

పెనుగొండ: భీమవరం మేమంతా సిద్ధం సభకు ఆచంట నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. మంగళవారం నియోజకవర్గంలో అన్ని గ్రామాల నుంచి అశేషంగా 200 పైగా బస్సులు, 100కు పైగా కార్లు, వేలాది మోటారు సైకిళ్లపై భీమవరం తరలివెళ్లారు. పెనుగొండ కళాశాల సెంటర్ నుంచి, ఆచంటలోని కచేరీ సెంటర్ నుంచి నాయకులు వాహనాలను ప్రారంభించారు. మహిళలు భారీగా తరలి వెళ్లారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పిలుపుతో భారీగా ప్రజలు తరలివచ్చారు. పెనుగొండలో బస్సులను మండల కన్వీనరు నల్లిమిల్లి వేణుప్రతాపరెడ్డి (బాబీ రెడ్డి), ఎస్సీ సెల్ మండల కన్వీనరు పలివెల శ్రీను, సేవాదల్ కన్వీనరు బాలం సత్తిరాజు, మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరావు, ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, పార్టీ నాయకులు చెవ్వేటి రాజు, రాపాక చిట్టిబాబు, వెలగల శ్రీనివాస రెడ్డి, మేడపాటి సురేష్ రెడ్డి, పిల్లి నాగన్న, చిన్నం రామిరెడ్డి, ఆకిశెట్టి చంటి, సుంకర నాగబాబు ప్రారంభించారు.

భీమవరం తరలివెళ్లిన పెనుమంట్ర కార్యకర్తలు

పెనుమంట్ర: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం భీమవరంలో నిర్వహించిన మేమంతా సిద్ధంసభకు మాజీ మంత్రి జిల్లా పార్టీ అధ్యక్షుడు చెరుకువాడ శ్రీ రంగనాథరాజు ఆదేశాలమేరకు పెనుమంట్ర మండలంనుంచి పెద్దఎత్తున నాయకులు కార్యకర్తలు అభిమానులు బస్సుల్లో తరలివెళ్లారు. పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకటనారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిని, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఈది అనిత ప్రవీణ్ నాయకత్వాల్లో 18 గ్రామాల నుంచి పెద్ద ఎత్తున అభిమానులు తరలివెళ్లారు. మండలంలోని ఎస్ ఇల్లిందలపర్రు, భట్లమగటూరు నెగ్గిపూడి మార్టేరు పెనుమంట్ల గ్రామాల నుంచి అధికసంఖ్యలో అభిమాను లు సీఎం జగన్ మోహన్ రెడ్డి సభకు హాజరయ్యారు.

గర్భిణులు, బాలింతలకు తరచూ వైద్య పరీక్షలు చేయాలి


ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: ఆరోగ్య ఉప కేంద్ర పరిధిలో గల గర్భిణులు, బాలింత, కిషోర బాలికలకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య వివరాలను నమోదు చేయాలని జిల్లా వైద్యాధికారి డి మహేశ్వరరావు కోరారు. పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఓపీ రిజిష్టరును పరిశీలించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు మందులు అందజేయాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరిగే విధంగా ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ప్రోత్సహించాలన్నారు. వడగాడ్పులు తీవ్రంగా వీస్తున్నందున ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు సద్వినియోగం చేసుకునే విధంగా బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్లు లీనా సుప్రియ, కిషోర్, జయదుర్గాదేవి వైద్య సేవలు, ఉచితంగా మందులు అందించారు. పంచాయతీ కార్యదర్శి లింగం సత్యనారాయణ, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఆఫ్తాలమిక్ అధికారి ఎంఆర్‌కే రాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికులకు బీమా బాండ్లు అందజేత


కేపీపాలెంలో మేస్త్రీకి బీమా బాండ్ అందజేస్తున్న భవానీ శంకర్, రాంమోహన్‌రావు

మొగల్తూరు: అధునాతన పరిజ్ఞానంతో భారతి సిమెంట్ తయారవుతుందని సంస్థ అసిస్టెంట్ మేనేజర్ జి రామ్మోహన్‌రావు, టెక్నికల్ ఆఫీసర్ ఎన్ భవానీశంకర్ తెలిపారు. మండలంలోని కేపీపాలెంలోని భారతీ సిమెంట్ డీలర్ విజయదుర్గ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన భవన నిర్మాణ మేస్త్రీల, కార్మికుల అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణాలకు నాణ్యమైన, మన్నికైన భారతీ సిమెంట్‌ను వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా మేస్త్రీలు, కార్మికులకు రూ.లక్ష చొప్పున బీమా బాండ్లను సంస్థ ద్వారా ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో విజయ దుర్గ ఏజెన్సీస్ డీలర్ సుంకర వెంకటకృష్ణ, సేల్స్ ఆఫీసర్ పి రాజా పాల్గొన్నారు.

18 నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్

నరసాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికలు 2024కు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18 నుంచి ప్రారంభమవుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అన్నారు. మంగళవారం నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల వ్యయ పరిమితి రూ.40 లక్షలు ఉందని తెలిపారు. వ్యయ పరిమితికి సంబంధించిన సిబ్బంది అంతా ఎన్నికల ప్రచారంపై నిఘా ఉంచాలని సూచించారు. నరసాపురం తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ మున్సిపల్ కమిషనర్ కె వెంకటేశ్వరరావు, అబ్జర్వర్ కె జోసఫ్ పాల్ పాల్గొన్నారు. ముందుగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో రిటర్నింగ్ అధికారి అచ్యుత్ అంబరీష్ మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తరువాత నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. నామినేషన్ ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాలను, డిపాజిట్ వివరాలపై పలు సూచనలు చేశారు.

రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం

పెనుగొండ: నియోజకవర్గంలో బుధవారం శ్రీరామనవమిని పురస్కరించుకుని వివిధ రామాలయాల్లో సీతారామ పట్టాభిషేకానికి వివిధ కమిటీల వారు ఏర్పాట్లు సిద్ధం చేశారు. పెనుగొండ, ఆచంట మండలాల్లోని గ్రామాల్లో మంగళవారమే శ్రీరామనవమి సందడి నెలకొంది. రామాలయాల వద్ద చలువ పందిళ్లు కళకళలాడుతున్నాయి. శెట్టిబలిజ రామాలయాలు, అగ్రికుల క్షత్రియులు, రావి చెట్టు సెంటర్లలో ఆర్యవైశ్య సంఘం రామాలయం, పెనుగొండ, వడలి, ములపర్రు, ఇలపర్రు, నడిపూడి, దేవ, చినమల్లం, ఆచంట మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాలను సుందరంగా అలంకరించారు.


వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

పెనుగొండ: టీడీపీ కూటమి ఎన్ని కుట్రలు పన్నినా, దాడులు చేసినా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీదే విజయమని, మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు పాలసత్తి రామిరెడ్డి (రాజా) అన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌కు నానాటికీ పెరుగుతున్న ఆదరణతో కూటమికి ఓటమి తప్పదని గ్రహించి దాడులకు పాల్పడుతున్నారన్నారు. మేమంతా సిద్ధం సభకు హాజరైన జనంతో భీమవరం జన సంద్రాన్ని తలపించిందన్నారు. దీంతో జిల్లాలో అన్ని సీట్లలోనూ వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు.

కూటమిది స్వార్థ రాజకీయం

పెదపాడు: టీడీపీ కూటమిది స్వార్థ రాజకీయమని, చంద్రబాబు స్వప్రయోజనాల కోసం రాజకీయాలు చేస్తున్నారని పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ విమర్శించారు. పెదపాడు మండలంలోని గుడిపాడులో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎన్ని జెండాలు జతకట్టినా పేదలంతా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం కట్టాలని ఆకాంక్షిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వడ్డి కార్పొరేషన్ డైరక్టరు ఘంటసాల ప్రభాకర్, సచివాలయ కన్వీనర్ ముంగర ఝాన్సీ, పార్టీ అధ్యక్షుడు ముంగర ఉమామహేశ్వరరావు, ముంగర శేషగిరిరావు, ఘంటసాల సుబ్బారావు, గెడ్డం తిరుపతిరావు, మువ్వల వేణు తదితరులు పాల్గొన్నారు.

కళారంగాన్ని ప్రోత్సహించాలి


పాలకొల్లు నటీనట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: కళారంగాన్ని బతికించేందుకు ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందించాలని బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల రామారావు అన్నారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో నటీనట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వివరించారు. వంగా నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో కళాకారులు యర్రంశెట్టి వెంకటరత్నం, వీరా వెంకట నరసింహారావును శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. పట్టణ ప్రముఖులు ఎంఎస్ వాసు, కేవీ కృష్ణవర్మ, కొట్టి భాస్కరరావు, గుడాల హరిబాబు, మేడికొండ శ్రీనివాస చౌదరి, గుండా రామకృష్ణ, పి రామమోహన్‌రావు, మేడి కొండ రామదాసు, సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాళాబత్తుల వెంకటేశ్వరరావు, జక్కంపూడి కుమార్, అంబటి మురళీకృష్ణ, జవ్వాది దాసరథి శ్రీనివాస్, రాజా తాతయ్య పాల్గొన్నారు. పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో మాంటిస్సోరీ స్కూల్ ఆవరణలో కళాకారుడు కొల్లి నరసింహమూర్తిని సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ప్రిన్సిపాల్ కేవీ కృష్ణవర్మ, కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు మానాపురం సత్యనారాయణ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు

నరసాపురం రూరల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 3వ రోజు మంగళవారం నరసాపురం పట్టణంలోని ప్రైవేటు స్కూల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక సిబ్బంది ఉపయోగించే పరికరాలు, వాటిని వినియోగించే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ఫైర్ సిబ్బంది భాస్కర్, సతీష్‌కుమార్, శ్రీను, పెద్దిరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రచారాలపై నిఘా


ఆచంటలో అధికారులకు సూచనలుచేస్తున్న రిటర్నింగ్ అధికారి స్వామి నాయుడు

పెనుగొండ: ఎన్నికల నేపథ్యంలో సీజర్, ఎన్‌కోర్ మేనేజ్‌మెంట్ అనుమతులు, సీ విజిల్ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి స్వామి నాయుడు తెలిపారు. మంగళవారం ఆచంట కార్యాలయంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. రూ.50 వేలు మించి నగదు పట్టుబడితే వాటికి తగిన ఆధారాలు చూపించాలన్నారు. సింగిల్ విండో విధానంలో సువిధలో వస్తున్న దరఖాస్తులను పరిశీలించి మార్గదర్శకాల మేరకు అనుమతులను జారీ చేస్తున్నామన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా సోమవారం రాత్రి వరకూ 35 ఫిర్యాదుల వచ్చినట్లు తెలిపారు. ప్రచారాల నిమిత్తం ప్రింటింగ్ చేసే కరపత్రాలు, ఇతర సమాచారం ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని ఆర్టికల్ 127 ఏ మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. సిద్ధాంతం చెక్ పోస్ట్ వద్ద తనిఖీ, 4 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, రెండు సర్వైవల్, 11 వీడియో సర్వైవల్ బృందాలను తనిఖీల కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్టేరు సమీపంలోని నెగ్గిపూడి వద్ద, కవిటం వద్ద, మరో రెండు స్టాటిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిపై సందేహాలుంటే హెల్ప్ డెస్క్ వద్ద నివృత్తి చేసుకోవాలని ఆర్వో సూచించారు.